


సాక్షి రంగారెడ్డి





బుధవారం ¤ 8 ¤ మార్చి ¤ 2023

న్యూస్‌రీల్

భక్తులతో కిటకిటలాడిన చిలుకూరు



ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

మొయినాబాద్‌: చిలుకూరు బాలాజీ దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం హోలీ పండుగతోపాటు పౌర్ణమి కావడంతో అధిక సంఖ్యలో తరలివచ్చారు. 11 ప్రదక్షిణలు, 108 ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో సుందరేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

నేడు మీర్‌పేటలో వేడుకలు

మీర్‌పేట: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మీర్‌పేట ఆంధ్రాబ్యాంక్‌ ఎదురుగా ఉన్న ఓపెన్‌ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సంబరాలకు విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, మేయర్‌ ఎం.దుర్గాదీప్‌లాల్‌ చౌహాన్‌, మహిళా కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.

సీపీఆర్‌పై అవగాహన రేపు

ఇబ్రహీంపట్నం: రెడ్‌క్రాస్‌ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై గురువారం ప్రత్యేకంగా అవగాహన నిర్వహించనున్నట్లు ప్రోగ్రాం కోఆర్డినేటర్‌ సతీష్‌వర్మ తెలిపారు. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో ఉదయం 11 గంటలకు కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఐఆర్‌సీఎస్‌ జిల్లా చైర్మన్‌ నర్సింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి మదన్‌మోహన్‌రావు, సీపీఆర్‌ రాష్ట్ర ప్రోగ్రాం ఆఫీసర్‌ డా. విజయ్‌భాస్కర్‌ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. గుండెకు ప్రాథమిక చికిత్సకు ఉపయోగపడే సీపీఆర్‌ గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

హెచ్‌ఆర్‌పీసీ సభ్యుడిగా వెంకటేశ్వర్లు



నియామకపత్రం అందుకుంటున్న వెంకటేశ్వర్లు

హుడాకాంప్లెక్స్‌: హ్యూమన్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ కమిటీ తెలంగాణ రాష్ట్ర సభ్యుడిగా నెలకంటి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌.వి. లక్ష్మి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర సభ్యుడిగా పదవి అప్పగించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో చిన్న పిల్లలపై, మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై హ్యూమన్‌ రైట్స్‌ ప్రొటెక్షన్‌ కమిటీ నిలదీసి బాధితులకు అండగా ఉంటుందన్నారు. ఈ మేరకు సేవలను అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంద సురేందర్‌రెడ్డి, కమిటీ సభ్యుడు కొండ వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

ఈనెల 15 వరకు పత్తి కొనుగోళ్లు

చేవెళ్ల: రైతులు పండించిన పత్తిని అమ్ముకునేందుకు చిట్టెంపల్లి బస్‌స్టేజీ వద్ద ఉన్న ధరణి కాటన్‌మిల్లులో కొనుగోలు కేంద్రం కొనసాగుతోందని యాజమాన్యం ప్రకటించింది. ఈనెల 15వ తేదీ వరకు కొనుగోలు చేయనున్నట్టు తెలిపింది. ఆ తరువాత కొనుగోలు నిలిపివేయబడుతుందని స్పష్టం చేసింది. పత్తి అమ్మకుండా నిల్వ పెట్టుకున్న రైతులు గమనించాలని సూచించింది. 15 వరకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది.



ఆమనగల్లు: హోలీ సంబరాల్లో యువకుల స్టెప్పులు



మొయినాబాద్‌రూరల్‌: అమ్మాపూర్‌లో రంగులు చల్లుకుంటున్న స్థానికులు



షాబాద్‌: రేగడిదోస్వాడ గ్రామంలో హోలీ సంబరాలు

జాలీగా హోలీ

హోలీ వేడుకలను జిల్లావాసులు మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. చిన్నా, పెద్దా తేడా లేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు. ఎక్కడ చూసినా సందడి వాతావరణం కనిపించింది. ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



షాద్‌నగర్‌లో..



ఇబ్రహీంపట్నం: ఉత్సాహంగా రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

వనితా వందనం



సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఒకప్పుడు భర్త చాటు భార్యలుగా ఉన్న మహిళలు ఇప్పుడు ఇటు రాజకీయాల్లోనూ.. అటు ప్రభుత్వ విభాగాల్లోనూ కీలకంగా వ్యవహరిస్తున్నారు. రాజ కీయ, ఆర్థిక, సామాజిక, సాంకేతిక, అధికారిక, వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో 'రాణి'స్తూ తోటి మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

తమదైన శైలిలో..

జిల్లా రాజకీయాల్లోనే కాదు.. రాష్ట్ర రాజకీయాల్లోనూ జిల్లా మహిళలు చక్రం తిప్పుతున్నారు. కీలక విద్యాశాఖ మంత్రిగా జిల్లాకు చెందిన పటోళ్ల సబితా రెడ్డి వ్యవహరిస్తున్నారు. జిల్లా పరిధిలో 27 మండలాలు ఉంటే వీటిలో 21 మండలాలు రూరల్‌ ఏరియాలో ఉ న్నాయి. 11 మంది జెడ్పీటీసీలు మహిళలే. మరో పదిమంది ఎంపీపీలుగా ఎన్నికై ..రాజకీయాలను శాసిస్తున్నారు. కీలకమైన జిల్లా పరిషత్‌ పీఠాన్ని సైతం మహిళా నేత అధిరోహించడం విశేషం. మంత్రి సబిత అసెంబ్లీ వేదికగా జిల్లా సమస్యలను ప్రస్తావించి పరిష్కార మార్గం చూపిస్తుండగా.. జెడ్పీ వేదికగా డాక్టర్‌ తీగల అనితారెడ్డి తనదైన శైలిలో స్పందిస్తున్నారు.

'ఆమె' కేంద్రంగా పాలన

- మంత్రిగా సబిత.. జెడ్పీ చైర్‌పర్సన్‌గా డాక్టర్‌ అనిత
- జెడ్పీటీసీ, ఎంపీపీల్లోనూ మహిళలదే ఆధిపత్యం
- కీలక ప్రభుత్వ విభాగాల్లోనూ బాధ్యతలు
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కీలక ప్రభుత్వ శాఖల్లో..

జిల్లాలోని కీలక ప్రభుత్వ శాఖలకు మహిళలే బాసులుగా వ్యవహరిస్తున్నారు. డీఆర్‌ఓ హరిప్రియ, రాజేంద్రనగర్‌ ఆర్డీఓ కె.చంద్రకళ, షాద్‌నగర్‌ ఆర్డీఓ రాజేశ్వరి, కలెక్టరేట్‌ పరిపాలనాధికారి ప్రమీల, పౌర సంబంధాలశాఖ అధికారి నార్ల పద్మశ్రీ, వ్యవసాయశాఖ అధికారి జె.గీతారెడ్డి, ఉద్యానశాఖ అధికారి ఆర్‌.సునందరెడ్డి, మహిళా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి ఎస్‌.మోతి, మత్స్యశాఖ అధికారి సుకీర్తి, సహకారశాఖ అధికారి ధాత్రిదేవి, పౌర సరఫరాలశాఖ మేనేజర్‌ శ్యామల లక్ష్మీదేవి, మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రత్నకుమారి, ఎస్టీ సంక్షేమశాఖ అధికారి రాజేశ్వరి సహా పలువురు మహిళలు కీలక శాఖలకు ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తున్నారు. పురుష ఉద్యోగులకు దీటుగా రాణిస్తున్నారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చే బాధితులకు వీరంతా అండగా నిలుస్తున్నారు. ఇటు కుటుంబాన్ని.. అటు ఉద్యోగ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నారు. ఇతర మహిళలకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ సునీతాలక్ష్మారెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభిస్తున్న రాష్ట్ర మహిళ కమిషన్‌ చైర్‌పర్సన్‌ సునీతాలక్ష్మారెడ్డి

మొయినాబాద్‌: సమాజంలో మహిళలకు అన్ని రంగాల్లో సమానత్వం ఉండాలని రాష్ట్ర మహిళా కమిషన్‌ చైర్‌పర్సన్‌ సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న కేజీరెడ్డి ఇంజనీరింగ్‌ కళాశాలలో మంగళవారం నిర్వహించిన మహిళా దినోత్సవానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళ లేనిదే జననం, గమనం, సృష్టి లేవన్నారు. సృష్టికి మూలం అయిన మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకొచ్చి అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. మహిళల భద్రతకోసం ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందన్నారు. షీటీంలు.. 181 హెల్ప్‌లైన్‌ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఎలాంటి ఆపదలో ఉన్నా మహిళలు హెల్ప్‌లైన్‌కు కాల్‌ చేస్తే వెంటనే స్పందించడం జరుగుతుందన్నారు. మహిళల రక్షణకోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని.. వాటిపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలన్నారు. మహిళా హక్కులకు ఎలాంటి భంగం కలుగకుండా మహిళా కమిషన్‌ అండగా ఉంటుందన్నారు. సాంకేతిక విద్యా పరంగా 62 శాతం యువతులు మాత్రమే విద్యను అభ్యసిస్తున్నారని.. ఉద్యోగ రంగంలో 14 శాతం మంది మహిళలు మాత్రమే రాణిస్తున్నారని తెలిపారు. అన్ని రంగాల్లో మహిళలు సమానత్వం సాధించాలని.. ఆ దిశగా దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కందకట్ల లక్ష్మీరెడ్డి, డైరెక్టర్‌ రోహిత్‌ కందకట్ల, ప్రిన్సిపాల్‌ విజయలత, పీజీ కళాశాల ప్రిన్సిపాల్‌ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్‌ చందన, ఏఓ వాణి తదితరులు పాల్గొన్నారు.

'పది'లో వంద శాతం లక్ష్యం

పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు

- వార్షిక పరీక్షలకు సిద్ధం చేసేలా నమూనా టెస్ట్‌లు
- పాఠ్యాంశాలపై ఎప్పటికప్పుడు అవగాహన
- చక్కగా ప్రిపేర్‌ చేసేలా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌
- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు



షాద్‌నగర్‌ బాలికల పాఠశాలలో నమూనా పరీక్షలు రాస్తున్న విద్యార్థినులు

షాద్‌నగర్‌: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. వార్షిక పరీక్షల్లో పదికి పది శాతం జీపీఏ సాధించేందుకు కృషి చేస్తున్నారు. ఈ మేరకు ప్రతి పాఠశాలలో పదో తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేకంగా తరగతులు నిర్వహిస్తున్నారు. గత ఏడాది కంటే ఈసారి మెరుగైన ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు కార్యాచరణ ప్రకారం ముందుకు సాగుతున్నారు. ఏప్రిల్‌ 3 నుంచి పరీక్షలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాలా సిద్ధం చేస్తున్నారు.

సందేహాల నివృత్తి

పదో తరగతి విద్యార్థుల కోసం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సాయంత్రం 4.45 నుంచి 6గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ఇప్పటికే సిలబస్‌ పూర్తి చేయగా పాఠాలను రివిజన్‌ చేయించడంతో పాటు, పాఠ్యాంశాల్లో వచ్చే సందేహాలను నివృత్తి చేస్తున్నారు.

పరీక్షలంటే భయం పోయేలా..

పదో తరగతి పరీక్షా విధానంలో విద్యాశాఖ కీలక మార్పులు చేసింది. ఇప్పటి వరకు 11 పేపర్లను ఆరు పేపర్లకు కుదించింది. వాటిలో 80 మార్కులు మాత్రమే పరీక్షలు రాయాల్సి ఉంటుంది. మిగతా 20 మార్కులు అంతర్గత పరీక్ష పద్ధతిలో నిర్వహించనున్నారు. పరీక్షా పత్రాల్లో మార్పులకు అనుగుణంగా పాఠశాలల్లో నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. వార్షిక పరీక్షలంటే విద్యార్థుల్లో భయం పోవాలనే ఉద్దేశంతో నమూనా పరీక్షలు రాయిస్తున్నారు. వారం రోజుల పాటు బోధించిన పాఠాలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలను ఎప్పటికప్పుడు తయారు చేసి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

అవగాహన.. కౌన్సెలింగ్‌

విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించడంతో పాటు, పరీక్షలంటే భయం పోగొట్టేందుకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. అవగాహన సదస్సులు, తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి కౌన్సెలింగ్‌ ఇస్తున్నారు. పాఠశాల నుంచి విద్యార్థులు ఇంటికి రాగానే, సెలవు రోజుల్లో సమయం వృథా చేయకుండా ఏవిధంగా చదివించాలన్న అంశంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఇదీ ఫలితాల తీరు

సంవత్సరం	హాజరైన విద్యార్థులు	పాసైన వారు	ఉత్తీర్ణత శాతం
2017	42,706	36,164	84.68
2018	43,392	37,809	87.13
2019	45,747	42,467	92.83
2022	47,157	42,460	90.04

విద్యార్థులకు అల్పాహారం

జిల్లాలో 244 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో సుమారు యాభైవేల మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. గత ఏడాది 90.04శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది వందకు వంద శాతం సాధించే దిశగా అధికారులు చర్యలు చేపట్టారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నేపథ్యంలో ఏప్రిల్‌ 1వ తేదీ వరకు పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించనున్నారు. ఇందుకు గాను ప్రభుత్వం ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 ఖర్చు చేస్తోంది. ఇప్పటికే పరీక్షా మెటీరియల్‌ అందజేశారు.

ఒత్తిడిని అధిగమించేలా..



గతంలో కంటే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు చర్యలు చేపడుతున్నాం. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు నమూనా పరీక్షలు నిర్వహిస్తున్నాం. పరీక్షల ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– ఝాన్సీ లక్ష్మి, జెడ్పీహెచ్‌ఎస్‌, హెచ్‌ఎం, వెలిజర్ల

ప్రత్యేకంగా దృష్టి



పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. బోధనా తరగతులతో ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. వార్షిక పరీక్షలకు విద్యార్థులను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసేందుకు చర్యలు చేపట్టాం.

– శంకర్‌ రాథోడ్‌, ఎంఈఓ, ఫరూఖ్‌నగర్‌

పూర్తిస్థాయిలో సన్నద్ధం



ఈ సారి వంద శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. పూర్తి స్థాయిలో వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. పరీక్షల సమయం దగ్గర పడుతోంది.. విద్యార్థులు సెల్‌ఫోన్‌లు, ఆటలకు దూరంగా ఉండాలి. చదువుపై దృష్టి సారించాలి.

– సుశీందర్‌రావు, డీఈఓ

అక్కడ పూజారులు.. అతివలే



మైసమ్మ దేవాలయంలో మహిళా పూజారులు

నాగోలు: ఎన్టీఆర్‌నగర్‌ సమీపంలో దాదాపు 400 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఖిల్లా మైసమ్మ దేవాలయం పూజారులందరూ మహిళలే. ఎన్నో ఏళ్ల వంశ పారంపర్యంగా వీరు ఇక్కడ పూజలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి అలంకరణ, హారతి ఇవ్వడం, కొబ్బరి కాయలు కొట్టించడం, వాహనాలకు పూజలు నిర్వహించడంతో పాటు దేవాలయంలో జరిగే అన్ని రకాల పూజలు అక్కడ ఉన్న మహిళా పూజారులే నిర్వహిస్తుండటం ఐదు తరాలుగా ఆనవాయితీగా వస్తోంది.

మా తాతల కాలం నుంచి..

ఖిల్లా మైసమ్మ దేవాలయంలో వంశపారంపర్యంగా పని చేస్తున్నాం. దేవాలయంలో జరిగే అన్ని కార్యక్రమాలు మేమే నిర్వహిస్తున్నాం. ఇప్పటి వరకు నిత్యం మా కుటుంబ సభ్యులే గర్భగుడిలో నిత్య పూజలు చేస్తున్నాం..

– అమృతమ్మ, మహిళా పూజారి

కుక్కల దాడిలో మేకలు మృతి

కేశంపేట: కుక్కల దాడిలో నాలుగు మేకలు మృతి చెందిన సంఘటన మండలంలోని వేములనర్వ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన అల్లు రవీందర్‌రెడ్డి తన వ్యవసాయ పొలం వద్ద మేకలు ఉంచాడు. వాటిపై కుక్కలు దాడి చేయడంతో చనిపోయాయి. బాధిత రైతును ఆదుకోవాలని స్థానికులు కోరారు.

విద్యార్థిపై దాడి చేసిన లెక్చరర్‌పై కేసు

మీర్‌పేట: వాట్సాప్ గ్రూపులో వీడియో పోస్టు చేసినందుకు గాను విద్యార్థిపై దాడికి పాల్పడిన లెక్చరర్‌పై మీర్‌పేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం ప్రకారం.. టీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం చదువుతున్న దక్షియాదీప్ తరగతి గదిలో లెక్చరర్ మహేష్ ఓ విద్యార్థి పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న వీడియోను వాట్సాప్ గ్రూపులో పోస్టు చేయగా, మహేష్ అతనిపై దాడి చేసిన విషయం తెలిసిందే. కాగా విద్యార్థి ఫిర్యాదు మేరకు పోలీసులు లెక్చరర్‌పై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మంగళవారం కళాశాలకు సెలవు కావడంతో బుధవారం కళాశాలకు వెళ్లి విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన


పోలింగ్ కేంద్రం వద్ద అదనపు ఎస్పీ తదితరులు

కొడంగల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాన్ని జిల్లా అదనపు ఎస్పీ రవీందర్ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు కల్పించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా కృషి చేయనున్నట్లు అదనపు ఎస్పీ రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సీఐ శంకర్, ఎస్‌ఐ రవిగౌడ్ పాల్గొన్నారు.



జయహో.. జనయిత్రి

అన్ని రంగాల్లోనూ మహిళామణులు రాణిస్తున్నారు.. ఎందరో నారీమణులు చరిత్రలో తమకంటూ ఓ స్థానాన్ని సాధిస్తున్నారు. భర్తల చాటున భార్యలం కాదంటూ.. రాజ్యాంగం కల్పించిన అవకాశాలను చక్కగా ఉపయోగించుకుంటూ కొందరు ప్రజా ప్రతినిధులుగా సేవలు చేస్తుండగా.. పోటీతత్వంతో ఉద్యోగాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వర్తిస్తూ తమకు తామే సాటి అంటూ నిరూపించుకుంటున్నారు మరికొందరు. మహిళల స్థితిగతులు బాగుపడనిదే సమాజం అభివృద్ధి చెందదు అన్న స్వామి వివేకానంద మాటలు గుర్తుకుతెచ్చుకుందాం. 'జయహో.. జనయిత్రి' అంటూ ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు రంగాల్లో రాణిస్తున్న పలువురి మహిళల అభిప్రాయాలు ఇలా..



ప్రశ్నించే తత్వం పెరగాలి



యాచారం: మహిళల్లో ప్రశ్నించే తత్వం పెరగాలి. రాజ్యాంగం మనకు ప్రజా ప్రతినిధులుగా ఎన్నికయ్యే అవకాశాలు కల్పించినా ఎక్కడో ఒక చోట అవమానాలకు గురికాక తప్పడం లేదు. భర్తల చాటు భార్యలంకాదనే విధంగా సమస్యలను అధిగమించాలి. తనకు రాజకీయాల్లో ఎన్నో సమస్యలు, ఇబ్బందులు వచ్చినా.. సొంతంగానే నిర్ణయాలు తీసుకుని రాణిస్తున్నాను. ప్రశ్నించే తత్వం పెరిగినప్పుడే హక్కులను సాధించుకుంటాం. **– కొప్పు సుకన్య, ఎంపీపీ యాచారం**

అక్షరాస్యత సాధించాలి



యాచారం: ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యే మహిళలు అక్షరాస్యత కలిగి ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిత్యం కొత్త జీవోలు తెస్తూ పరిపాలన సాగిస్తాయి. అక్షరాస్యత పొంది ఉంటే మానమే అర్థం చేసుకుని ప్రజలకు మరింతా సేవ చేయగలిగే అవకాశాలు ఉంటాయి. అధికారులను అడగాల్సిన పని ఉండదు. మహిళలు అక్షరాస్యత సాధిస్తేనే కుటుంబాలు బాగుపడుతాయి. **– జంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు యాచారం**

ఉద్యోగ నిర్వహణలో ..



యాచారం: ఉద్యోగ నిర్వహణలో సమస్యలు వచ్చినప్పుడు శాంతియుతంగా పరిష్కరించుకోవాలి. కొన్నిసార్లు చిన్నచూపు చూడడం గమనిస్తునే ఉన్నాం. విధుల్లో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నాం. అయినా ఎక్కడ కూడా తీసిపోవడం లేదు. ఉన్నతాధికారుల సూచనలు పాటిస్తూ ముందుకు సాగితే మంచిది. **– సుచరిత, తహసీల్దార్, యాచారం**

ఇబ్బందులు ఎదురైనా..



యాచారం: ఉద్యోగ బాధ్యతలతో పాటు, కుటుంబ సమస్యలు మహిళలపై అధికంగా ఉంటాయి. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వాటిని దాటుకుంటూ పోవాలి. పురుష అధికారుల కంటే మనమే అన్ని విషయాల్లో రాణిస్తున్నాం. ప్రజాప్రతినిధుల సహకారం బాగుంది. **– విజయలక్ష్మి, ఎంపీడీఓ యాచారం**

కఠిన నిర్ణయాలతో..



యాచారం: ఉద్యోగ, విధి నిర్వహణలో ఉన్నతాధికారుల ఆదేశాలు పాటించే విషయంలో.. కఠిన నిర్ణయాల వల్ల ఇబ్బందులు ఉత్పన్నమవుతున్నాయి. అయినా లెక్క చేయడం లేదు. మహిళలైన ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓల సహకారంతో విధుల్లో ముందుకు వెళ్తున్నా. **– ఉమారాణి, మండల పంచాయతీ అధికారి**

చైతన్యం రావాలి



చేవెళ్ల: మహిళలకు రాజకీయంగా 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నా పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవడం లేదు. మహిళా లోకం అన్ని రంగాల్లో రాణిస్తేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుంది. మహిళా ఆర్థికంగా ఎదగాలి. **– ఎం.విజయలక్ష్మి,ఎంపీపీ**

మేయర్‌గా సేవలందించడం అదృష్టం



మీర్‌పేట: సాధారణ గృహిణి అయిన తాను భర్త ప్రోత్సాహంతో రాజకీయాల్లోకి వచ్చాను. కార్పొరేషన్‌కు మొదటిసారి జరిగిన ఎన్నికల్లో గెలుపొంది మంత్రి సబితారెడ్డి సహకారంతో మేయర్‌గా ఎన్నికై ప్రజలకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. మేయర్‌గా మొదట్లో కొంత ఇబ్బందిగా ఉన్నప్పటికీ మంత్రి ప్రోత్సాహం, ధైర్యం రాజకీయంగా ఎదిగేందుకు ఎంతో ఉపయోగపడుతోంది. –ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, మేయర్, మీర్‌పేట

అన్ని రంగాల్లో పోటీ పడుతున్నారు



చేవెళ్ల: మారుతున్న కాలంతోపాటు మహిళల్లో కూడా ఎంతో మార్పు వస్తోంది. గతంతో పోలిస్తే ఇప్పుడు మహిళలు ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్నారు. రాజకీయల్లో కల్పిస్తున్న రిజర్వేషన్ల మాదిరిగానే అన్ని రంగాల్లో మహిళలకు 50శాతం రిజర్వేషన్లు కూడా కల్పించాలి. **– మర్పల్లి మాలతి, జెడ్పీటీసీ, చేవెళ్ల**

తల్లిదండ్రుల కృషితోనే..



మొయినాబాద్‌రూరల్: సమాజంలో ఉన్నత స్థానం సంపాదించడంలో తల్లిదండ్రుల కృషి చాలా ఉంది. విద్యతోనే సమాజంలో క్రమ శిక్షణతో ఎలా మెలగాలో తెలుసుకున్నాను. మండలంలోనే హిమాయత్‌నగర్ మేజర్ గ్రామ పంచాయతీ అయినప్పటికీ మహిళా సర్పంచ్‌గా రాణిస్తున్నాను. ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాను. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలిగా సైతం కొనసాగుతున్నాను.
– మంజుల, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్

సమస్యలపై పోరాటం



మొయినాబాద్‌రూరల్: మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్నాం. మండలంలో ఎంపీపీగా నా బాధ్యత నెరవేరుస్తున్నాను. మహిళలకు కేటాయించిన రిజర్వేషన్లకు అనుగుణంగా ఎంపీపీగా ఎదగడం గర్వకారణంగా ఉంది. మహిళలు సహనం, పట్టుదలతో ఉంటే ఎలాంటి లక్ష్యాన్నైనా ఛేదిస్తాం. ఆత్మవిశ్వాసంతో అన్నింటా రాణించాలి.
– గునుగర్తి నక్షత్రంజీవంతు, ఎంపీపీ, మొయినాబాద్

ఆత్మస్థైర్యంతో ఎదుర్కోవాలి



మొయినాబాద్‌రూరల్: మహిళలకు ఎన్నో సమస్యలు ఎదురవుతుంటాయి. వారు సహనం కోల్పోకుండా ఆత్మస్థైర్యంతో ముందడుగు వేస్తే సమస్యకు పరిష్కారం దొరుకుతుంది. కొందరు మహిళలు చిన్న చిన్న సమస్యలకు కుంగిపోయి ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఈ మధ్య అధికమైంది. దీంతో పిల్లల జీవితాలు నాశనం అవుతాయన్న విషయం గుర్తుంచుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా పురుషులతో సమానంగా చూస్తున్నప్పటికీ.. అమ్మాయి ఎదుగుదలలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నప్పటికీ వాటిని ఆత్మస్థైర్యంతో ఎదుర్కొవాలి.
– అనితశ్రీహరియాదవ్, మాజీ ఎంపీపీ

సమాన అవకాశాలు కల్పిస్తున్నారు



చేవెళ్ల: మహిళలకు అన్ని రంగాల్లో సమాన అవకాశాలు కల్పిస్తున్నాయి ప్రభుత్వాలు. ఆడ మగ అనే వివక్ష పోవాలి. మహిళలు ఇప్పటికే ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారు. ఇంకా మార్పు రావాలి. విద్యావంతులుగా ఎదగాల్సిన అవసరం ఉంది. **– రమాదేవి, ఏడీఏ, చేవెళ్ల**

చదువుకు ప్రాధాన్యత ఇవ్వాలి



చేవెళ్ల: ప్రతి మహిళ చదువుకున్నప్పుడే అభివృద్ధి చెందుతారు. చదువు ఒక్కటే అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది. ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు అధిరోహించాలి. ప్రస్తుతం వార్డు మెంబర్‌నుంచి రాష్ట్రపతి వరకు మహిళలు రాణిస్తున్నారు. ప్రతి మహిళ తమ పిల్లలను ఆడమగ అనే తేడా లేకుండా పెంచాలి. అప్పుడే వారికి అన్ని రంగాల్లో రాణించేందుకు అవకాశం ఉంటుంది.
– బండారి శైలజ, సర్పంచ్ చేవెళ్ల

ఎందులోనూ తక్కువ కాదు



చేవెళ్ల: మహిళలు ఎందులోనూ తక్కువ కాదని నిరూపిస్తున్నారు. పురుషులతో సమానంగా ఉద్యోగ, వ్యాపార, రాజకీయ రంగాల్లో రాణిస్తున్నారు. ప్రతి కుటుంబంలో మహిళ పాత్ర ప్రాముఖ్యత పెరిగింది. సమాజంలో మహిళలు అనే చులకనబావన పోవాలి. మహిళలు కూడా సమానమే అనే భావన రావాలి. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హత్యలు, వరకట్నపు వేధింపులు పూర్తిగా పోవాలి. దీనికి ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. **– శోభారాణి, సీడీపీఓ, చేవెళ్ల**

సమానత్వం కోసం పోరాటం



తలకొండపల్లి: మహిళల సాధికారతయే లక్ష్యంగా వారి అభ్యున్నతి, ఆర్థికాభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్నాం. స్త్రీల భాగస్వామ్యంతోనే సమాజం ప్రగతి సాధిస్తుంది. వారి సమానత కోసం అహర్నిశలు పోరాటం చేస్తున్నాం. స్త్రీలు ఆర్థిక, విద్య, ఆరోగ్య, తదిత రంగాల్లో.. ఇంటా బయట ప్రపంచమంతా వివక్షను ఎదుర్కొంటున్నారు. ఈ వివక్షను పారదోలేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. మహిళల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని ప్రభుత్వాలు చెబుతున్నా అవి ఆచరణలో అమలు కావడం లేదన్నది జగమెరిగిన సత్యం. స్త్రీ పురుషుల సమాన పనికి సమాన వేతనం అందడం లేదు. బాల్య వివాహాలను రూపుమపాలి. కేంద్రం, రాష్ట్రంలో ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి మహిళల ఆర్థికాభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలి. **– తిర్మణి నిర్మల, ఎంపీపీ, తలకొండపల్లి**

కీలక పోస్టుల్లో మహిళలే..


యాచారం మండల పరిషత్ కార్యాలయం

యాచారం: మండలంలోని కీలక పోస్టుల్లో మహిళలే కొనసాగుతున్నారు. ఎంపీపీగా కొప్పు సుకన్య, జెడ్పీటీసీ సభ్యురాలుగా చిన్నోళ్ల జంగమ్మ, ఎంపీడీఓగా విజయలక్ష్మి, తహసీల్దార్‌గా సుచరిత, మండల పంచాయతీ అధికారిగా ఉమారాణి, వైద్యాధికారిగా లలిత, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారిగా రజిత, 24 గ్రామ పంచాయతీలకుగాను 11 గ్రామాల్లో మహిళలే పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అదే విధంగా 11 గ్రామాల్లో మహిళా సర్పంచులుగా, 8 గ్రామాల్లో ఎంపీటీసీ సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరంతా కీలక పోస్టుల్లో ఉండి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పరిపాలనలో ఎన్నో సవాళ్లను అధిగమించి ముందుకు సాగుతున్నారు.

అక్రమ అరెస్టులతో ఆపలేరు


శివస్వాముల కుటుంబాలను పరామర్శిస్తున్న లక్ష్మణ్ తదితరులు

- తాండూరు గడ్డపై కాషాయ జెండా ఎగరేస్తాం
- బీజేపీ నేత, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్
- దేవనూరులో శివస్వాములకు పరామర్శ

యాలాల: అక్రమ అరెస్టులతో బీజేపీ ఎదుగుదలను ఆపలేరని ఆ పార్టీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. మండల పరిధిలోని దేవనూరు గ్రామానికి చెందిన శివస్వాములు బెయిల్‌పై విడుదలైన సందర్భంగా మంగళవారం వారిని పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత నెల దేవనూరులో జరిగిన ఘటనలో ఐదుగురు శివస్వాములతో పాటు బీజేపీ నేత మురళీకృష్ణగౌడ్‌పై అక్రమ కేసులు బనాయించి, జైలుకు పంపడం అధికార దుర్వినియోగానికి పరాకాష్ట అని మండిపడ్డారు. శివస్వాములతో పాటు మురళీగౌడ్‌కు పార్టీ అండగా ఉంటుందని, ఈ విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే అనుచరులు ఇటీవల మురళీగౌడ్ ఇంటిపై దాడికి పాల్పడటం హేయమైన చర్యగా పేర్కొన్నారు. పోలీసులు సైతం అధికార పార్టీ నాయకులకు వంత పాడటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. తాండూరులో బీజేపీ రోజురోజుకూ బలపడుతోందని తెలిపారు. ఈ అక్కసుతోనే తమ పార్టీ నేతలు, కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుని తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. అధికార గర్వంతో చెలరేగిపోతున్న కొంతమంది.. ఎన్ని కేసులు పెట్టించినా వెనక్కి తగ్గేదే లేదన్నారు. ఇందు కోసం ఎంతవరకైనా పోరాడుతామని స్పష్టంచేశారు. వచ్చే ఎన్నికల్లో తాండూరు గడ్డపై బీజేపీ జెండా ఎరగేస్తామని ధీమా వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, నాయకులు మారుతీ కిరణ్, పరమేశ్వర్‌రెడ్డి, యాలాల మండల అధ్యక్షుడు మహిపాల్ తదితరులు ఉన్నారు.

పండుగ పూట విషాదం


ప్రదీప్ (ఫైల్)


అపస్మారక స్థితిలో ఉన్న ప్రదీప్‌ను బైక్‌పై ఆస్పత్రికి తీసుకెళ్తున్న మిత్రులు

యాలాల: హోలీ పండుగ రోజున తాండూరులో విషాదం అలుముకుంది. రంగులు చల్లుకున్న అనంతరం స్నానం కోసం కాగ్నా నది చెక్‌డ్యాం వద్దకు వెళ్లిన బీటెక్ విద్యార్థి ప్రమాదవశాత్తు నీట మునిగి చనిపోయాడు. ఎస్‌ఐ అరవింద్‌కుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన ప్రదీప్‌కుమార్(18) నగరంలోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. హోలీ సందర్భంగా తోటి స్నేహితులతో సరదాగా రంగులు చల్లుకున్నారు. అనంతరం పాత తాండూరు సమీపంలోని కాగ్నా నదిపై నిర్మించిన చెక్ డ్యాంలో స్నానం చేసేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఈతరాని ప్రదీప్ నీటిలోతును అంచనా వేయక మునిగిపోయాడు. ఇది గుర్తించిన స్నేతులు అతన్ని ఒడ్డుకు తీసుకు వచ్చారు. అప్పటికే అపస్మారక స్థితిలోకి వెళ్లిన ప్రదీప్‌ను బైక్‌పై తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కార్డు వద్దు.. క్యాష్ ఇవ్వాలన్నందుకు

కొట్టి చంపారు

- జన్వాడలో పెట్రోలు పంపువద్ద అర్ధరాత్రి దారుణం
- సిబ్బందిపై ముగ్గురు వ్యక్తుల దాడి
- నిందితులను శిక్షించాలని గ్రామస్తుల ఆందోళన


ఆస్పత్రిలో సంజయ్ మృతదేహం

మణికొండ: నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్వాడలోని పెట్రోల్ పంపు వద్ద సోమవారం అర్ధరాత్రి దారుణం చోటుచేసుకుంది. వాహనంలో పెట్రోల్ పోసి..స్వైపింగ్ మిషన్ పనిచేయటం లేదని, క్యాష్ మాత్రమే ఇవ్వాలనటంతో ఆగ్రహానికి గురైన ముగ్గురు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. ఓ వ్యక్తి కణతపై గుద్దటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగి సీఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... జన్వాడ చౌరస్తాలో ఉన్న శ్రీ పద్మావతి ఫిల్లింగ్ స్టేషన్‌లో అదే గ్రామానికి చెందిన సంజయ్ (22) పనిచేస్తున్నాడు. సోమవారం అర్ధరాత్రి మల్లేష్, అనోక్, నరేందర్ అనే ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో కారులో వచ్చి పెట్రోల్ పోయాలన్నారు. అప్పటికే పంపు మూసి వేశారు. చాలా దూరం వెళ్లాల్సి ఉందని పెట్రోల్ పోయాలని కోరటంతో నిద్రలేచిన కార్మికులు పోశారు. అనంతరం డబ్బులు ఇవ్వాలని కోరగా కార్డు ద్వారా చెల్లిస్తామన్నారు. తమ వద్ద ప్రస్తుతం స్వైపింగ్ మిషన్ లేదని, క్యాష్ రూపంలో ఇవ్వాలని క్యాషియర్ కోరాడు. దాంతో మాటామాటా పెరిగి పంపు సిబ్బందిపై దాడికి దిగారు. అడ్డు వచ్చిన సంజయ్ కణతపై గుద్దారు. దాంతో అతను అక్కడే కుప్ప కూలాడు. అవేమీ పట్టించుకోకుండా నిందితులు కారులో పారిపోయారు. స్పృహ తప్పి పడిపోయిన సంజయ్‌ను నార్సింగిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు డాక్టర్లు ధృవీకరించారు. దాంతో పోలీసులకు ఫిర్యాదు చేయటంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కాగా యువకుడి మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని జన్వాడ గ్రామస్తులు మంగళవారం రాస్తారోకో నిర్వహించారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని పోలీసులు హామీ ఇవ్వటంతో ఆందోళనను విరమించారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనలో నిందితులపై పీడీ యాక్టు నమోదు చేస్తమని నార్సింగి సీఐ శివకుమార్ పేర్కొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

0% ఇంట్రస్ట్‌తో 30 నెలల ఈక్వల్ EMIతో రాజాపూర్ దగ్గర అన్ని డేవలప్‌మెంట్స్‌తో 147 గజాల MUDA(HMDA) లేఔట్లో ఓపెన్ Plots కలవు. ఫ్రీ సైట్ విజిట్. Ph: 9949695027 [HA-1059]

హైదరాబాద్ @ రామోజీఫిల్మ్‌సిటీ దగ్గర కొత్తగూడెం ఫ్రూట్ మార్కెట్ & HMDA లాజిస్టిక్ హబ్ పక్కనే ఉన్న మాన్యూ HMDA వెంచర్‌లో ఇల్లు కట్టుకునే ప్లాట్లు కలవు. Ph: 9666845756 [HA-2428]

@Koheda Near Pedda Amberpet-HMDA (LRS) approved plots of sizes 181, 319, 233, 520 sq yards Contact.9246363369/9666759480 [H-796731]

Flash Flash 11,500/- per Sqrd. HMDA Approved, Bank Loan @ Choutuppal, & 11000/- per Sqrd 200Ft. Rd. Sagar Highway Facing @ Yacharam Call : 9700021777 [H-793384]

Services

80G CLAIM, TAX Deduction for Donation "Paul Foundation" (A Public Charitable Trust) Our Activities: Free Medical Camp Villages, All Social Works Ph: 7901373777 [H-792836]

BUSINESS SERVICE

మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును Ph: 9100329739 [H-792829]

మీ బంగారం మణప్పురం, ముత్తూట్ మరియు ఏ ఇతర ఫైనాన్స్ లో ఉన్నా మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. స్పాట్ క్యాష్. ఫోన్ : 9494995999 [H-787442]

మీ బంగారుపై (92%) బ్యాంకుల్లో గాని, ముత్తూట్, మణప్పురం ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్నలో మా డబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) సంప్ర॥ 8247630166 [H-793386]

BUSINESS OFFER

తక్కువ పెట్టుబడితో నెలకు 20వేల నుండి 50వేల వరకు సంప్రాదించాలనుకుంటున్నారా M/F సేల్స్‌మెన్స్ కావలెను. వివరాలకు సంప్ర: 9177923958, 9440094170 [H-787488]

Wanted

హారిక హోమ్‌కేర్‌లో పెద్దవారికి సేవ చేయుటకు హెల్పర్స్, కేర్‌టేకర్స్, ఆయాలు, అటెండర్స్, ఏజెంట్స్ (M/F) కావలెను. జీతం: 20-25వేలు, రూం+మీల్స్ ఫ్రీ. Ph: 8501869108 [HA-28978]

సిటింగ్ జాబ్స్ & వర్కింగ్ పార్ట్‌నర్స్: రిసెప్షనిస్ట్, ఇంట్లో నుండి టెలికాలర్స్ అన్ని మండలాల్లో స్త్రీ/పు. Age- 16-72, బ్రాంచ్ మేనేజర్స్, రిపోర్టర్లు, వీడియో ఎడిటర్లు, యాంకర్లు, డ్రైవర్లు, సూ. వైజర్, జీ: 8-16K + కమీషన్ 50% ఫ్రీ హాస్టల్. ఫోన్ : 9505261777, UPL NEWS. [H-792944]

అనుభవం గల కార్ డ్రైవర్ కమ్ ఆఫీస్ అసిస్టెంట్ కావలెను సంప్రదించండి: Ph: 8500002608 [WB-57184]

పంజాగుట్ట దగ్గర టిఫిన్ సెంటర్‌లో స్టాప్‌బాయ్స్, స్టాల్ సూ॥వైజర్స్, దోశ & కూరగాయల కటింగ్ మాస్టారు కావలెను ఇక్కడే ఉండి చేసుకునే వారికి జీతం + ఫ్రీ వసతి భోజనం కలదు. Ph: 9666934949/ 7330608776 [H-793576]

సెు సూపర్ వైజర్స్ - 17000/-, సెుగార్డ్స్ - 14000/- మరియు ఫీల్డ్ ఆఫీసర్స్ కావలెను. ఏరియా బాలానగర్, బాచుపల్లి, మణికొండ, జీడిమెట్ల, జూబ్లీహిల్స్. Q: 10th-Degree, మెట్రో మేనేజ్‌మెంట్ సర్వీసెస్. ఫోన్: 9885657755 [H-792981]

ఓల్డ్ ఏజ్ హోమ్‌లో పని చేయుటకు బ్రాహ్మణ వంట మనిషి ఆయాలు వార్డ్ బాయ్స్ కావలెను. మంచి జీతం, ఉచిత వసతి భోజన సౌకర్యం. ఫోన్: 9246241153 / 9246201153. [H-778975]

లక్కీ సీ ఫుడ్స్ (లైవ్ ఫిష్) హయత్ నగర్ కొరకు, స్టోర్ కీపర్, మార్కెటింగ్ మేనేజర్ మరియు ఫిష్ కట్టర్స్ కావలెను. బోన్ లెస్ ఫిష్, రొయ్యలు, కొరమీను హోల్ సేల్ రేట్స్‌లో లభించును. ఫోన్ : 9885409786, 8807392629 [H-792983]

మా సంస్థ యొక్క అడ్వర్టైజ్‌మెంట్స్‌ను మేము ఫ్రీగా ఇచ్చేమొబైల్ ద్వారా రోజుకు 100 SMSలు పంపడం ద్వారా వారానికి రూ. 3500/- ఆదాయం పొందవచ్చు. సెల్ : 90595 09586 [L-526]

సరూర్ నగర్ ఆఫీస్‌లో వర్క్‌చేయుటకు టెలీ కాలర్ -2, ప్యాకింగ్ గర్ల్స్ - 3, ఆటో & కార్ డ్రైవర్ -1, అర్జెంటుగా కావలెను. జీతం : 10 K to టు 15K. ఫోన్ : 80748 51049 [V- 775209]

లేపాక్షి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషేంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీవసతి + భోజనం. జీ: 20K. ఏజెంట్ కమీషన్ 5K. Ph: 9640300074 [HA-1047]

అన్నపూర్ణ హోమ్‌కేర్‌లో వృద్ధులను చూసుకొనుటకు, పేషెంట్ కేర్, కేర్‌టేకర్స్, స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 18000/- రూము + భోజన సౌకర్యం, ఏజెంట్ కమిషన్ 5K ఇవ్వబడును. Ph: 9390427694 [H-778976]

ఇంటర్, డిగ్రీ ఆపై చదువుకున్న యువతీ, యువకులకు, గృహిణులకు గొప్ప అవకాశం. మీ ఇంటి వద్ద చేస్తూ నెలకు 20 వేలు పైన సంపాదన100% Genuine © 89787 74595 [B-934]

Reputed Hospitality Services Organisation Required for its Head Office in Hyderabad HR Executive with 3 years Exp. Account Executive with Tally 5 years Exp. & Purchase Executive with 5 years Exp., Contact : 8125813721. [H-792945]

Senior Graphic Designers-2 Sal: 20,000/- to 30,000/-. Flex Pasting Workers-4, Sal 13,000/- to 18,000/-, Room & Food Available. VJA © 9961 8888 17 [B-1193758]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు). ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : ఇకపై మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9010188892	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9010213322
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453